క్లుప్తంగా

అందుబాటులో యూరియా

దమ్మపేట: కోపరేటివ్ సొసైటీ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు, తమ ఆధార్ కార్డుతో సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఒక్క రైతుకు గరిష్టంగా రెండు 50 కేజీల యూరియా బస్తాలు మాత్రమే ఇస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేజీబీవీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి

గుండాల: తెలంగాణ రాష్ట్రంలో కస్తూర్బా పాఠశాలలో పని చేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలని వారి సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు డిమాండ్ చేశారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 24న జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఒంటరి మహిళలకు చేయూత

అశ్వాపురం: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ఐటీసీ బంధన్ సంస్థ కార్యాలయం వద్ద గురువారం పలువురు లబ్ధిదారులకు సంస్థ ఆధ్వర్యంలో చిరు వ్యాపారం చేసుకునేందుకు నాలుగు చక్రాల బండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎన్.వెంకటేశ్వర్లు, వేణు, అశోక్, సాయి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయానికి విరాళం

భద్రాచలంటౌన్: పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా వారి ఆలయంలో ప్రతీ గురువారం జరిగే అన్నదాన కార్యక్రమానికి భక్తుడు విరాళం అందజేశాడు. పట్టణానికి చెందిన కోనేరు సౌభాగ్యవతి జ్ఞాపకార్థం అమెరికాలో ఉంటున్న ఆమె మనుమడు అందించిన రూ.50 వేలను కుటుంబసభ్యులు కోనేరు జానకి గురువారం ఆలయ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణకు అందజేశారు. ఆలయ కోశాధికారి కుంచాల రమేష్, గొర్ల వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సస్పెన్షన్ అన్యాయం

దుమ్ముగూడెం: కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన తమని అకారణంగా పార్టీ నుండి సస్పెండ్ చేయడం అన్యాయమని కాంగ్రెస్ గిరిజన సంఘం నాయకులు ఉబ్బా వేణు, తెల్లం నరేష్‌లు అన్నారు. గురువారం ములకపాడులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.. పార్టీ వ్యవహారాల్లో కొనసాగుతూ పార్టీని కాపాడుకుంటూ వస్తున్న తమని సస్పెండ్ చేశారని దీనిపై రాష్ట్ర నాయకత్వాన్ని కలుస్తామన్నారు.

కొత్త రుణాలివ్వాలి

ములకలపల్లి: ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు పూర్తిగా రుణమాఫీ చేసి, వెంటనే కొత్త రుణాలు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఏపీజీవీ బ్యాంకు మేనేజర్ భరత్‌క్రాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఊకంటి రవికుమార్, వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, గౌరి నాగేశ్వరరావు, వర్సా శ్రీరాములు, పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ మార్గం అనుసరణీయం

మణుగూరు టౌన్: కొండా లక్ష్మణ్ బాపూజీ చూపిన మార్గం అనుసరణీయమని పద్మశాలీల సంఘం రాష్ట్ర కార్యదర్శి, మణుగూరు అధ్యక్షులు దుస్సా సమ్మయ్య అన్నారు. గురువారం పద్మశాలీ భవన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోట శ్రీనివాస్, రుద్ర నాగరాజు, మహేశ్వరపు రమేశ్, వెన్న వెంకట్రావు, కొలిపాక ప్రభాకర్, తాటి సత్యనారాయణ, జీవీ, తుమ్మా లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అశ్వారావుపేటరూరల్: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.రామచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. అశ్వారావుపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి బీఏ, బీఎస్సీ లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్, బీకాం గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, పేర్కొన్నారు. వివరాలకు 9963329249 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వర్ధంతి సభలను జయప్రదం చేయండి

గుండాల: ఈనెల 24వ తేదీ నుంచి 30 వరకు నిర్వహించే న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు ముక్తార్ పాషా వర్ధంతి సభలను జయప్రదం చేయాలని ఇల్లందు సబ్ డివిజన్ నాయకులు రాంసింగ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో పోస్టర్లను విడుదల చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సాంబ, కోశాధికారి గణేష్, ప్రణయ్, అనిల్, వినోద్, సారయ్య పాల్గొన్నారు.

ఆరంభ శూరత్వమే..!

సాఫీగా సాగని చెత్త సేకరణ

- కొద్దిరోజులకే మూలనపడిన ఆధునిక యంత్రాలు
- ఇంకా రోడ్డెక్కని స్వీపింగ్ మిషన్లు
- రూ.75 లక్షల నిధులతో కొనుగోలు చేసినా ఫలితం శూన్యం


మున్సిపాలిటీ ఆవరణలో పక్కన పెట్టిన స్వీపింగ్ మిషన్లు

మణుగూరు టౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ, రోడ్ల శుభ్రత కోసం ఆర్భాటంగా రూ.లక్షల వెచ్చించి కొనుగోలు చేసిన ఆధునిక యంత్రాల నిర్వహణ భారంగా మారి పక్కకు ఉంచడంతో అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. యంత్రాలు తీసుకొచ్చిన కొద్ది రోజులకే మూలన పడడంతో ఆరంభ శూరత్వమే తప్పా ఆచరణ శూన్యమని ప్రజలు వాపోతున్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2021-22లో భాగంగా లక్షలు వెచ్చించి తెచ్చిన జఠాయువులు, స్వీపింగ్ మిషన్లు, సక్కింగ్ మిషన్ మున్సిపాలిటీ కార్యాలయంలో పక్కకు పెట్టేశారు. మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా, 17 (పాతవి 9, కొత్తవి 8) స్వచ్ఛ ఆటోలు, ఒక డోజర్, నాలుగు ట్రాలీతో కూడిన ట్రాక్టర్ ఇంజన్లు ఉన్నాయి. ప్రధాన రహదారిపై చెత్తను ఎత్తివేసేందుకు రెండు స్వీపింగ్ మిషన్లు, ఒక జఠాయువుతో పాటు మురుగు గుంతల్లోని చెత్తను బయటకు తీసేందుకు సక్కింగ్ మిషన్‌ను ప్రవేశపెట్టారు.

భారంగా నిర్వహణ...

ప్రధాన రోడ్డును శుభ్రం చేసేందుకు తెచ్చిన రెండు స్వీపింగ్ మిషన్లు తెచ్చిన మూడు నెలలకే మూలకు పెట్టారు. ఒక్కో వాహనానికి బ్రష్‌లు నెలకు రెండు కావాల్సి ఉండగా, అవి ఇతర ప్రాంతాల నుంచి రూ. 14 వేల వ్యయంతో దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉందని సమాచారం. డ్రెయినేజీ కాల్వలు చెత్తతో నీరు నిలిచిపోకుండా తెచ్చిన రూ.30 లక్షల సక్కింగ్ మిషన్, ఇంతకు వరకు బయటకు తీయకపోవడంతో టైర్లు పనికిరాకుండా పోతున్నాయన్న ఆరోపణలున్నాయి. రూ.21.20 లక్షల విలువైన జఠాయువులను ప్రారంభించిన రెండు నెలలకే పైపులు పగిలిపోగా, ఆపరేటర్ దొరకడం లేదని చెబుతూ పక్కన పెట్టారని తెలుస్తోంది. అప్పటి కమిషనర్ నాగప్రసాద్ వీటిని పట్టన ప్రగతి నిధులతో కొనుగోలు చేయగా, ఆ తర్వాత ఇన్‌చార్జ్ కమిషనర్, మరో ఇద్దరు మారగా, వీటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.


జఠాయువు..


సక్కింగ్ మిషన్

నిర్లక్ష్యంతోనే జ్వరాలు..

జఠాయువు, స్వీపింగ్ మిషన్లు, సక్కింగ్ మిషన్లు మూల పడడంతో ఉన్న ఆరుగురులో ఏడుగురు డ్రైవర్లు కొన్ని ఏరియాలతో పాటు ప్రధాన రహదారిపై చెత్త తరలించే పనిలో నిమగ్నమవుతున్నారని తెలుస్తోంది. దీంతో కమలాపురం, గాంధీనగర్, రాయిగూడెం, రాజుపేట, బాపనకుంట ఏరియాలలో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిసున్నాయి. పారిశుధ్యం లోపించి పిచ్చిచెట్లు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. సైడ్ డ్రైన్ల పూడికతీత తీయకపోవడంతో కొద్దిపాటి వర్షాలకే నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెంది ప్రజలు జ్వరాల బారిన పడుతునారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చెత్త తీసుకెళ్లడం లేదు



మా గాంధీనగర్ లోకి చెత్త వాహనాలు రావడం లేదు. పిచ్చిమొక్కలు తొలిగించడం లేదు. సైడ్ డ్రైన్లలో చెత్త పేరుకు పోయి దుర్గంధం వెదజల్లుతోంది. సిబ్బంది ఎప్పుడో ఒకసారి వస్తారు వచ్చినా చెప్పినా విని వెళ్లిపోతారు.

– బత్తుల బుచ్చమ్మ, గాంధీనగర్

తప్పనిసరైతేనే మిషన్లు తీస్తాం..



జఠాయువు, సక్కింగ్, స్వీపింగ్ మిషన్లు అత్యవసరమైతేనే బయటకు తీస్తున్నాం. డీజిల్ అధికంగా అవుతుండటంతో, మెయింటెనెన్స్ ఎక్కువ అవుతోంది. అవకాశం ఉన్నంత మేరకు సిబ్బందితోనే పనులు చేపిస్తున్నాం. అన్ని ఏరియాలకు చెత్త సేకరణ వాహనాలు పంపుతాం.

– ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్

మెరుగైన వైద్యమే లక్ష్యం..


వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న విప్ రేగా

మణుగూరు రూరల్: ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించడమే సీఎం కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. గురువారం ఆయన ప్రభుత్వ వంద పడకల ఏరియా ఆస్పత్రిని సందర్శించి నిర్వహిస్తున్న పలు అభివృద్ధి పనులను, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలో వైద్యచికిత్సలు పొందుతున్న రోగులను పరామర్శించి, అందుతున్న వైద్యసేవలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విప్ రేగాకు సన్మానం..

నూతనంగా బాధ్యతలు చేపట్టిన జెడ్పీ కో ఎడ్యుకేషన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగశ్రీ ప్రభుత్వ విప్ కాంతారావును స్థానిక క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేగాకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఆర్ఐ రాజేష్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు పరిశీలన..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట పంచాయతీలో కోటి రూపాయలతో జరుగుతున్న ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణ పనులను ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి పనులు జరుగుతున్న తీరు, పురోగతిని తెలుసుకున్నారు. పనులు నత్తనడకన సాగుతున్నాయని అంతర్గత రహదారులకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ డీఈ, ఏఈతో ఫోన్లో మాట్లాడి స్థానికులకు ఇబ్బందులు లేకుండా పనులు నాణ్యతతో వేగవంతంగా చేయాలని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, పీఏసీఎస్ డైరెక్టర్ కాసరబాద సందీప్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోడి అమరేందర్, పాటి మన్మథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం..

గుండాల: ఏజెన్సీ మండలాలైన గుండాల, ఆళ్లపల్లి ప్రాంతాల్లో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధికి బాటలు వేశామని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. గురువారం ఆయన గుండాల ఆళ్లపల్లి మండలాల్లో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఎంపీపీ ముక్తి సత్యం, కొండ్రు మంజు భార్గవి, జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, కొమరం హన్మంతు, సర్పంచులు, పలు శాఖల అధికారులు, నాయకులు భవాని శంకర్, తెల్లం భాస్కర్, రవీందర్, పాయం నర్సింహరావు, బాబా పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

గుండాల: గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని మామకన్ను ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగులకు జూలై నుంచి నూతన పీఆర్‌సీని అమలు చేయాల్సి ఉన్నందున పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని, గతంలో తెలంగాణాలో మొదటి పీఆర్‌సీని సకాలంలో ఇవ్వకపోవడంతో 22 నెలల పీఆర్సీ బకాయిలు నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంవత్సర కాలంగా కుబేరులో పెండింగ్‌లో ఉన్న ఫైనల్ పేమెంట్స్, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ జీపీఎఫ్ రుణాలు, మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులన్నింటిని వ్యక్తిగత ఖాతాల్లోకి జమ అయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బాలు, బి.వెంకటేశ్వర్లు, కాంతారావు, మోహన్ రావు, నర్సింహరావు, నరేందర్, సూర్యనారాయణ రామయ్య, సేన తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


కరపత్రాన్ని అందజేస్తున్న పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్: బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి శూన్యమని, కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం గడపగడపకు కాంగ్రెస్ పదో రోజు కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని కోట కట్ట, విఠల్‌రావు నగర్, పీకే-1 సెంటర్‌లలో కాలినడకన తిరిగి పార్టీ పెట్టబోయే పథకాలను వివరించారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని పీకే-1 సెంటర్‌కు చెందిన పలు పార్టీల నుంచి 150 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పాయం వెంకటేశ్వర్లు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేవీ.రావు, నాయకులు కుర్రం రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలైన ఘటన గురువారం అశ్వారావుపేటలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా టీ నర్సాపురం మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన రఘు, అనిల్, బాదేష్ బైక్‌పై దమ్మపేట వైపు నుంచి అశ్వారావుపేటకు వస్తున్న క్రమంలో స్థానిక ఐసీడీఎస్ ఆఫీస్ సమీపంలో అదుపు తప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

మద్దతు ధరలపై చట్టం చేయాలి

బూర్గంపాడు: రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలపై పార్లమెంట్‌లో చట్టం చేయాలని ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు భిక్షపతి డిమాండ్ చేశారు. గురువారం బూర్గంపాడులో మండల స్థాయి సంయుక్త కిసాన్ మోర్చా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పంటలకు మద్దతు ధరలపై పార్లమెంట్‌లో చట్టం చేయాలనే జాతీయస్థాయి డిమాండ్‌ను రైతులలోకి తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులుగా బయ్యా రాము, అలవాల సీతారామిరెడ్డి, ఇర్పా సతీష్, రాంబాబులను ఎన్నుకున్నారు.

పరిశుభ్రత పాటించాలి

మణుగూరు రూరల్ : మండల పరిధిలోని కూనవరం గ్రామ పంచాయతీలో మహిళా సమైక్యత సంఘాలతో గురువారం స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘాల వారితో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనిక ప్రసాద్, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ... ప్రతీ మహిళ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీటీసీలు తాటి సరిత, గుడిపూడి కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, మహిళా సంఘాల సభ్యులు, ఏఎన్ఎం హెచ్ లక్ష్మీ, ఆశ వర్కర్ వై.నర్సులమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద ఏర్పడిన భారీ గుంతను గురువారం భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ పూడ్చించారు. గతంలోనూ గుంతను పూడ్చించినా ఎప్పటికప్పుడు పెరుగుతూనే వస్తోంది. సంబంధిత నేషనల్ హైవే అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో పోలీసుల మాత్రమే ముందుకు వచ్చి చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అధికారులు స్పందించి ఈ గుంత వల్ల ఏర్పడుతున్న సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గురజాడకు నివాళి


నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో ప్రముఖ కవి గురజాడ అప్పారావు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భద్రయ్య, కామేశ్వరరావు, రాంబాబు, వెంకటరమణ, సుధాకర్ పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

అశ్వారావుపేటరూరల్: అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ ఎదుట ధర్నా చేపట్టారు. పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్, లక్ష్మణరావు, వాసం బుచ్చిరాజు, కల్లయ్య పాల్గొన్నారు.

దమ్మపేట: అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి సీనియర్ అసిస్టెంట్ మధుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు అమర్లపూడి రాము, ఊకే అప్పారావు, కుంజా కాంతారావు, సున్నం కృష్ణారావు, తాటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ విచారణకు సిద్ధం

చంద్రుగొండ : బీఆర్ఎస్ నాయకులు తమను మానసికంగా హింసిస్తున్నారని తిప్పనపల్లి సర్పంచ్ ధరావత్ పార్వతి, ఉపసర్పంచ్ దారావత్ రామారావు ఆరోపించారు. గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో సూజాతనగర్ రోడ్డుపై గురువారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్లలో తాము గ్రామంలో చేసిన అభివృద్ధిపై బహిరంగ విచారణకు సిద్ధమని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే మెచ్చా పంచాయతీకి ఒక్కపైసా నిధులు ఇవ్వకపోగా నిధులు మంజూరు చేశారని గ్రామంలో ప్రచారం చేస్తూ తమను మానసికంగా క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సయ్యద్ జాకీర్, సయ్యద్ అజ్గర్, గోరేమియా, హుసేన్, పసుపులేటి రాధాకృష్ణ, అంచె యాకయ్య, రహీం మియా, మోదీన్, బుజ్జి, ఆసీఫ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

భద్రాచలంఅర్బన్: ఏరియా ఆస్పత్రి వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ భద్రాచలం పట్టణ కమిటీల ఆధ్వర్యంలో గురువారం సమ్మె నిర్వహించారు. అనంతరం కార్మికుల సమస్యలపై జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త రవిబాబు, సూపరింటెండెంట్ రామకృష్ణ కార్మికులతో మట్లాడి పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనం సోమవారం వరకు కార్మికుల అకౌంట్లో వేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా మూడో నెల వేతనాన్ని అక్టోబర్ మొదటివారంలో కార్మికుల అకౌంట్‌లలో డిపాజిట్ చేపిస్తానన్నారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ నర్సారెడ్డి, కో కన్వీనర్ మర్లపాటి రేణుక, ఉబ్బ రమా, సంతోష్ కుమార్, గుడిపల్లి లక్ష్మీకాంత్, కృష్ణ, వెంకటరమణ, నరేందర్, నాగరాజు, పద్మ, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

బూర్గంపాడు: విద్యార్థులు సేవాభావం పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో చదువులను కొనసాగించాలని స్థానిక ఎస్సై రాజ్‌కుమార్ సూచించారు. బూర్గంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలన్నారు. మొబైల్ వినియోగాన్ని తగ్గించుకుని పుస్తకపఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. హెచ్‌ఎం జాన్సన్, ఏఎస్సై సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సహకార సంఘాలను సద్వినియోగం చేసుకోవాలి


చర్ల: సహకార సంఘాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చర్ల సొసైటీ అధ్యక్షుడు పరుచూరి రవికుమార్ అన్నారు. రైతు రుణమాఫీ పత్రాల పంపిణీ, కొత్త రుణాలను మంజూరుకు గురువారం సంఘం ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ రైతులందరికీ తిరిగి మళ్లీ వ్యవసాయ రుణాలను అందజేస్తామని ఆయన తెలిపారు. సంఘం ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎస్‌డీ జిలానీ, సహకార సంఘ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. ఈ మేరకు గురువారం రోడ్లపై ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో మానవహారాలతో నిరసన తెలిపారు. పలు పార్టీల నాయకులు వీరి సమ్మెకు మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్


భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


దమ్మపేట: ర్యాలీలో అంగన్‌వాడీలు..


అశ్వాపురం: మానవహారంతో నిరసన..

గ్రామాల్లో వైద్య శిబిరాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి పంచాయతీ పరిధిలోని గంగారం, పాపిడిగూడెం గ్రామాల్లో గురువారం వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ సాధు జోత్స్నబాయి సూచన మేరకు సీహెచ్‌వో సుప్రియ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. నాయకులు ఆళ్ల రాంబాబు, ఏఎన్ఎం చిలకమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : మండలంలోని దుమ్ముగూడెం, పర్ణశాల ప్రాథమిక వైద్యశాల పరిధిలో డాక్టర్లు పుల్లారెడ్డి, రేణుకారెడ్డిల ఆధ్వర్యంలో తాటివారిగూడెం, చింతగుప్ప, అచ్చితాపురం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ సాగర్, సర్పంచ్ కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్ గౌడ్, అనిత, సెక్రటరీ రవి, రమణ, నాగేశ్వరరావు, సారిక, భూ లక్ష్మి, జయ భారతి, నలంద ఉన్నారు.

చర్ల రూరల్: మండలంలోని సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదమిడిసిలేరు గ్రామంలో డాక్టర్ దివ్యనయన ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. హెచ్ఈఓ బాబూరావు, హెల్త్ సూపర్ వైజర్ కనకదుర్గ, ఎంఎల్‌హెచ్‌పీ దీప్తి, హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణవేణి, పాల్గొన్నారు.

కరకగూడెం: మండలంలోని పద్మాపురం పంచాయతీ పరిధిలోని మొగలితోగూ గ్రామంలో ఆయుర్వేద వైద్యాధికారి సీహెచ్ కుమారస్వామి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎంఎన్ఓ శ్రీనివాసరావు, ఆశలు ఉన్నారు.

మణుగూరు రూరల్: మండల పరిధిలోని ముత్యాలమ్మనగర్, గుండు సింగారం, కట్టుమల్లారం గ్రామాలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆయా గ్రామాల ప్రజలకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెంటల్ హెల్త్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ కారం విజయకుమారి, ఎస్‌యూఓ లింగ్యా నాయక్, పీహెచ్ఎన్ సత్తెమ్మ, హెచ్‌వి జానకి, రాం ప్రసాద్, పుష్ప, ప్రమీల, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


అశ్వారావుపేటరూరల్: వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది


దుమ్ముగూడెంలో..


కరకగూడెంలో..


మణుగూరు రూరల్: వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది